

# వెలుగు

పి.యస్. నారాయణ

ఎక్కడో దూరతీరాలల్లో ఉద్యోగం చేస్తున్నవాడి మనస్సు తరచు తన వారిమీదకు, తన ఊరిమీదకు మళ్ళటం సహజం.

నాకూ అంతే అయింది!

కృష్ణా ఎక్స్‌ప్రెస్ అంటూ వచ్చిం తరువాత హైద్రాబాద్‌కు గుంటూరు ఆరుగంటల దూరానికే జరిగి కూర్చున్నది. ఉదయం ఏడుగంటలకు ఎక్కితే ఒంటిగంట కొట్టేటప్పటికల్లా మా వాళ్ళ ముందు వుంటాననేది ఖాయం !

నాకు చాలాసార్లు అనిపించింది— శారదని చూడటానికా ఈ ఎత్తు అని !

ఏమి ?

గుంటూరు వెళ్ళాలి !

వెళ్ళాలీ అనుకున్నప్పుడు అడ్డేమిటి?

బయల్దేరాను...సావిత్రిని రమ్మంటే ఆఫ్ ఇయర్లీ ఎగ్జామ్స్ పదిరోజులలో వస్తున్నయి శెలవు దొరకదంది....

ఆఫీసులో శెలవు చీటి యిచ్చినప్పుడే శారదకూ టెలిగ్రాం యిచ్చాను !

శారద స్టేషన్‌కు వస్తుందా ?

వస్తే !

ఏవో—వస్తుందో—రాదో !

తెలియదు—శారదను చూచి రెండు సంవత్సరాలయింది — శారదను చూడకుండా ఇన్నాళ్ళు ఎలా వున్నానా అనిపించింది—

శారద మారిపోయిందేమో ?

—నన్ను మర్చిపోయివుంటుందా ? అవును. శారదంటే గుర్తుకు వచ్చింది— శేఖరం ! వాడు నిజంగా అదృష్టవంతుడు !

* * *

మధ్యాహ్నం పన్నెండూ యాభై నిముషాలకు గుంటూరులో కృష్ణా ఆగింది. ఇక్కడకు వచ్చేటంతవరకూ వున్న ఉత్సాహం రైలు ప్లాట్‌ఫారం మీద ఆగింతరువాత లేదు— దాని స్థానే ఏదో భయం—శారద రాకుండా వుంటే బాగుండు !— అబ్బ—శారదను చూచి ఎన్నాళ్ళయింది— శారద నన్ను మర్చి పోతే ?

"—ఇంకెంత సేపు కూర్చుందామని అలా—దిగు !—

మైగాడ్ ! — శారద కంఠమే అది!

భయం భయంగా తలతిప్పాను.

శారదే !

"వచ్చావా ! — **రావేమో** నను కున్నాను !"

"అదేం ?"

"అలా అనిపించింది !"

ఒక్క క్షణం నా ముఖంలోకి నేను కలవరపడేలా సీరియస్‌గా చూచింది. ఆ పైన కొద్దినిముషాలవరకూ మామధ్య మౌనమే !

ఎవరి ఆలోచనలు వారివి.

శారదే ముందు కోలుకున్నది. "దిగు !"

ఆడదానికి వున్నంత గుండె కఠినత మొగాడికి వుండదేమో ననిపించింది నాకు. నీరసంగా లేచాను. పైనున్న సూట్కేసును చేతిలోకి తీసుకున్నాను. ఎయిర్ బ్యాగ్‌ను భుజానికి తగిలించు కున్నాను. చిన్నగా అడుగులు వేసు కుంటూ పెట్టి దిగాను.

తలుపు ఎదురుగ్గా శారద నిలబడి వున్నది.

"పోర్టర్‌కి ఇవ్వరాదూ అవి !".

"బరువే మున్నదని !"

యిద్దరం ప్లాట్‌ఫారందాటి బయటకు వచ్చాం. రిక్షావాళ్లు మూగుతున్నారు. వాళ్ళను తప్పుకుంటూ ముందుకు వచ్చి కారు లాక్‌తీసి డోరు తెరిచింది.

"శేఖరం లేడా ?" అన్నాను.

ఒక్కసారి నా ముఖంలోకి సూటిగా చూచి, "వున్నాడు !" అన్నది—నాకు అర్థంగాని ఆ చూపులలో ఆ క్షణాన అతడి ప్రసక్తి తేవటం ఇష్టంలేదన్న భావం వ్యక్తమవుతున్నదా అని లీలగా తోచింది నాకు.

"అఁహఁ—లేదు—కాదు అతనికి అవసరం లేదా— అని !" సర్దుతున్న ట్లుగా అన్నాను.

సైడ్ గ్లాస్ దించుతున్నదల్లా ఆగి, "అయితే నీకు తెలియదా?" అన్నది— కళ్ళు పెద్దవి చేసుకొని.

"తెలియవలసిందేమైనా వున్నదా ?"

"శేఖరం రిజైన్ చేశాడు !"

"చేసి !"

"చేశాడు—అంతే !"

"ఎందుకు చేశాడూ అంటున్నాను!"

"ఆరునెలల క్రితం హార్ట్ కంప్లె యింట్ వచ్చింది — డాక్టర్లు వద్దన్నారు !"

"శారదా !—నిజమా ?"

"నీతో అబద్ధం చెబితే నాకు లాభ మేమైనా వస్తుందా ?" పేలవంగా నవ్వింది.

"సో—సారీ ! — నాకు తెలియదు ఈ విషయం ఇంతవరకూ — నాకు ఒక్క ముక్కైనా రాయలేదేం ?"

"రాస్తే— నీ గుండేమైనా ఆయనకు ఇచ్చి వుండేవాడివా ?"

—మౌనమే శరణ్యం నాకు !

కారు జిన్నాటవర్ వైపుకు వెళుతోంటే —"ఇల్లు మారారా?" అన్నాను.

"లేదు !"

"మరి — ఇటు తీసుకు వెళు తున్నావ్ ?"

"సుదర్శన్ ఏసీకి వెళ్ళి కాసిని కాఫీ త్రాగుదాం—ఎందుకనో నాకు ఒంటరిగా నీ ముందు కూర్చొని కాసేపు కరువు తీరా ఏడ్వాలనిపిస్తోంది !"

నేను ఉలిక్కిపడి ఆమె వైపుకు తిరిగాను.

తరిచిచూస్తే ఆమె ముఖం బాగా వాడిపోయి వున్నట్లనిపిస్తోంది. దిగుళ్ళ గూళ్ళు కళ్ళచుట్టూ చుట్టుకున్నట్లని పిస్తోంది. మనిషిలో ఇదివరకటి ఉత్సాహంగూడా కరువైనట్లే వున్నది !

మౌనంగా ఆమె వంకే చూస్తున్న నా వైపు ఒక్కసారి తలతిప్పి చూచి చాలా పేలవపు నవ్వు నవ్వింది.

"అసలు ఏమైంది ?"

"దురదృష్టం—నాకు శేఖరం భర్త అవ్వటం !"

ఈ మాట నన్ను మరీ తికమక చేసింది.

శేఖరం, శారదా ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు— ఒకవిధంగా ఈ క్షణాన ఆమె నోటినుండి వెలువడిన ఆ మాట నాకు షాకే !

ఆనాడు విశాఖపట్టణం బీచ్‌లో నాకూ, శారదకూ నడుమ నడిచిన సంభాషణను నేను మరిచిపోలేను.

అప్పుడప్పుడు అనిపిస్తుంటుంది— ఆనాటి ప్రవర్తన నేను సిగ్గుపడేలా వున్నదా అని !

దూరాన సముద్రపు అలలు నాలోని కోరికల్లా మీదిమీదికి వస్తున్నయి— కాళ్ళు జాపి ఆ కోరికల అలలలో నన్ను నేను తడుపుకుంటున్నట్లుగా శారదకు దగ్గరగా జరిగి, "నేను నిన్ను ప్రేమి

స్తున్నానని చెప్పుకోవటంలో ప్రత్యేక తేమీలేదు — అందుకే అలా చెప్పుకోవటం యిష్టంలేదు—నిన్ను వివాహం చేసుకుందామనుకుంటున్నాను — నీకు అభ్యంతరమా ?" అన్నాను ఆప్యాయతను నా కంఠంలో రంగరించుకొని.

కళ్లు రెపరెప లాడించింది నా వంక విచిత్రంగా చూస్తూ. అరచేతిని అటూ యిటూ తిప్పి చూచుకుంటూ, ప్రేమలూ, పెళ్ళిళ్లూ స్నేహానికి కత్తిర్లే అవుతయి గదూ ?" అన్నది.

"ఎందుకనుకోవాలి అలా ?" భయం భయంగా అన్నాను — అలల నురుగు జారిపోతున్న నీటితో కలసి రూపు మార్చుకొని కరిగిపోతోంది.

"అలా నీవు అనుకోనూ అంటే అది నా అదృష్టంగా భావిస్తాను— నేను శేఖరాన్ని వివాహం చేసుకుందామనుకుంటున్నాను !" నేను ఆ షాక్‌నుండి కోలుకునేలోగానే, "నిన్ను హర్ట్ చేస్తే నన్ను క్షమించు !" అన్నది.

హృదయం నీటి బుడగలా ఫట్‌మని పగిలిపోయినా భరించక తప్పదు. పేలవమైన నవ్వుతో, నీరసపు చూపులతో, "సో—హార్టీ కంగ్రాట్స్—ఫర్ బోత్ ఆఫ్ యూ !" అన్నాను — ఏడుపు ఒక్కటే తక్కువ అనిపించింది ఆ సమయంలో నాకు.

"కోపం లేదా ?"

"నీ మనస్సెరుగని నా మనస్సు మీద నాకు కోపంగానే వున్నది !"

"మన్నించలేవా ?" బాధగా అన్నది.

"నన్ను నేను మన్నించుకోక తప్పదు గదా !"

—ఈసారి వచ్చిన అల నా పాదాలను తడిపి మరీ జారిపోయింది.

ఆనాడు అంత ధైర్యంగా ఇంట్లో వాళ్ళను గూడా ఎదిరించి శేఖరాన్ని చేసుకున్నది, ఈనాడు ఇలా పశ్చాతాప పడటానికేనా ?



సుదర్శన్ ముందు కారు ఆగింది. ఏసీ రూంలోకి వెళ్ళాం. ఎవ్వరూ లేరు. గుంటూరు మనుషులకు జనవరి ఎండా కాలం కాదు.

"ట్రీట్‌మెంటు తీసుకుంటున్నాడా శేఖరం ?"

"ఉఁహూఁ—"

"అదేం ?—"

"బ్రతకటం యిష్టంలేదట !"

"వ్హాటే ఫూల్ !"

"నిజమే !"

ఆశ్చర్యంగా ఆమెవంక చూశాను.

"మనిషి ఎన్నడూ పతనమవ్వగూడదు—ఒక్కసారి అయినతరువాత తిరిగి కోలుకోవటం జన్మలో జరగని పని !"

"చెడు అలవాట్లు ఏమైనా వున్నయ్యా ?"

"అలవాట్లు అనేవి చెడువా మంచివా అని ఎవరు చెబుతారు ! — దొంగను పట్టుకొని దొంగతనం మంచిదా అంటే మంచిదే అంటాడు !"

"తాగుతాడా ?"

"లేదు !"

"పేకాడతాడా ?"

"ఉఁహూఁ—"

కాస్త తటపటాయించి, "గరల్ ఫ్రెండ్స్—!" అన్నాను.

"నా బెటాల్ —"

"మరి—?"

ఒక్కక్షణం భయంకరమైన నిశ్శబ్దం మా నడుమ నిలిచింది. "మా పెళ్ళి పెద్దల అభీష్టానికి వ్యతిరేకంగా నీ కళ్ళముందే జరిగింది—గుర్తున్నది గదూ!"

"అవును !"

"ఆరు నెలల తరువాత ఒకరోజు రాత్రి సూటిగా నా కళ్ళలోకి చూస్తూ—నిన్ను ఒక్క ప్రశ్న అడగాలని వున్నది శారదా—నీ సమాధానంమీదే నా భవిష్యత్తంతా వున్నది—కానీ నిజంచెబితేనే నాకు సంతోషంగా వుంటుంది— అన్నారు !"

ఆ ప్రశ్న ఏమై వుంటుందా అని ఆలోచిస్తూ గాజుగ్లాసును చేతిలోకి తీసుకున్నాను—మంచినీళ్లు త్రాగుదామా అన్నట్లుగా.

శారద తడికళ్ళతో నా ముఖంలోకి చూస్తూ అన్నది. "సత్యం నిన్ను ప్రేమించాడని నాకు తెలుసు—మాటలలోనే ఆగిపోయిందా — లేక సంబంధబాంధవ్యాలు గూడా పెట్టుకున్నారా మీరు — నిజం చెబితే యిద్దరికీ మంచిది !"

నా చేతిలోని గ్లాసు క్రిందపడి ముక్కలయి గదంతా చిందరవందర అయింది.

"ఘోరం శారదా !"

* * *

పావుగంటదాకా మా నడుమ మాటల్లేవు.

బిల్లు చెల్లించి బయటకువచ్చి కార్లో కూర్చున్నాం. నా మెదడు మొద్దుబారగా సర్వం మరిచిపోయాను— ఓ విగ్రహంలా శారద పక్కన ముందు సీట్లో కూర్చున్నాను.

ఎక్కడికి వెళుతున్నామో నాకు తెలియదు. గుంటూరులో మా యింట్లో కొన్ని రోజులు సరదాగా గడపాలని వచ్చిన మాటయితే వాస్తవమేగాని— వచ్చిన ఈ కొద్దినిముషాలలోనే గుంటూరు నాకొక ఇనుప కొలిమి అవుతుందని నేను కలలో గూడా ఊహించలేదు.

నాకే ఇంత అసహ్యంగా వున్నదే శేఖరం ప్రశ్న— అతడి భార్య శారదకు ఎలా వుంటుంది ?

కొద్దిసేపటికి కారు ఎక్కడో ఆగినట్లనిపిస్తే తల తిప్పి బయటకు చూశాను. అది రింగురోడ్డు. ఓ పెద్ద చింతచెట్టు క్రిందగా ఆపింది కారుని శారద. పక్కనే ఓ మామిడితోట— లోతైన మోటబావిలో నీళ్లు ఎద్దులు పడుతున్న శ్రమకు ఫలితంగా పైకి వస్తున్నయి.

"నీవేం చెప్పావు ?" మొట్టమొదటిసారిగా తడబడే గొంతుకను అదుపులోకి తెచ్చుకుంటూ నేనే అన్నాను.

"ఏం చెప్పి వుంటానో ఊహించు!"

తిరిగి నిశ్శబ్దం— తిరిగి శూన్యం—

ఏం చెప్పి వుంటుంది ఆ పరిస్థితులలో ఓ స్త్రీ — ఏడుపు తప్ప ఆమెకు సమాధానం ఏముంటుంది ?

స్టీరింగ్‌మీద తలపెట్టుకొని అదే సమాధానాన్ని చెప్పాను అన్నట్లుగా ఏడుస్తున్నది శారద.

"ఇనాళ్లూ నాకెందుకు రాయలేదు!"

"ఎలా రాయలో అర్థంకాక !"

ఓ భయంకరమైన సమస్య మా యిద్దరిమీదా నల్లటి దుప్పటిలా పడి మమ్మలి ఉండలా చుట్టేస్తోంది.

నేను ఆమె వీపుమీద చేయివేసి అనునయంగా, "ఛ! ఊరుకో శారదా ! —ప్రతి ప్రశ్నకూ ఒక సమాధానముంటుంది—అయితే ఆ చిక్కు ఎలా విప్పాలీ అనేది మనం ఆలోచించాలి !" అన్నాను.

వడివడిగా హ్యాండ్ బ్యాగ్ తెరిచి ఒక చిన్నసీసా బయటకు తీసింది. "నా దగ్గర ఈ సమాధానం ఎప్పుడూ రెడీగానే వుంటుంది !" అన్నది.

నేను వింతగానూ, భయంగానూ ఆ సీసావంకచూచాను. అవి నిద్రమాత్రలు. — ఒకటి వేసుకుంటే ఈ ప్రపంచాన్ని కొద్దిగంటలు మర్చిపోగలుగుతాం— అన్నీ వేసుకుంటే—శాశ్వతంగా మర్చిపోగలుగుతాం !

చటుక్కున ఆ సీసాను లాక్కొని, "నామీద ఏమాత్రం గౌరవమున్నా ఎప్పుడూ యీ సీసాను గురించి ఆలోచించబోకు !" అన్నాను వడివడిగా.

"ఆల్‌రైట్—నేను వాటిని మర్చిపోతాను—నన్ను నీతోబాటు తీసుకువెళ్ళు — నన్ను యీ నరకంనుంచి తీసుకువెళ్ళు—"

"నాతో వచ్చి ఏంచేస్తావ్ ?"

"రోజూ నీ బూట్లు పాలిష్‌చేస్తాను—నీకు గుడ్డలు అందిస్తాను—నీకు ఏం కావాలన్నా చిటికెలలో చేకూరుస్తాను—నాకు ఆమాత్రపు జీవితం చాలు !"

"మరి సావిత్రిని ఏంచేయమంటావ్" సావిత్రి నా సహధర్మచారిణి!

స్టీరింగ్‌కు వేసి తలను కొట్టుకోసాగింది శారద.

"నన్ను బ్రతకనీయవ్ — నన్ను చావనీయవ్—ఏంచెయాలి నేను ?"

ఆ ప్రశ్నకు సమాధానంకోసమే నేను కళ్ళు మూసుకున్నాను !

* * *

రాత్రి తొమ్మిది గంటలయింది.

మా అక్కయ్యగారింట్లో వరండాలో కూర్చొని పిల్లలతో కబుర్లు చెబుతుంటే వాకిట్లో కారు ఆగిన శబ్దమయింది. శారద కాదుగదా అనుకుంటూ తలెత్తాను—శారదే.

"సత్యం!—అర్జంటుగా రావాలి !" అన్నది దగ్గరిగా వచ్చి నిలబడి.

"ఏమైంది ?" ఆత్రంగా అడిగాను.

"ముందు బయలుల్దేరు !" వెను

దిరిగి వెళ్ళి కారు స్టీరింగ్ ముందు కూర్చున్నది. నేను వెళ్ళి ఆమె పక్కగా కూర్చున్నాను.

"శేఖరంకు యెలా వున్నది ?"

"తెలియదు !"

"మరి నీ వెక్కడనుంచి వస్తున్నావ్ ?"

"ఇంటినుంచే !"

"శేఖరం ఇంటిలో లేడా ?"

"లేడు !"

"యెక్కడికి వెళ్ళాడు ?"

"ఏమో !"

"అంటే !"

"అదే తెలియదంటున్నాను !"

ఓ మడతపెట్టిన కాగితం నా చేతికిచ్చి కుర్చీలో వెనక్కువాలిపోయింది—ఇంటికెళ్ళిన అయిదు నిముషాలకు—

ఆశ్చర్యపోతూ ఆ కాగితాన్ని విప్పాను.

"మీ పాపం పడింది — అందుకే సత్యం మరీ బరితెగించి యిరవైరోజులు యీ ఊళ్ళో ఉందామనుకుంటున్నాడు ! — ఇక నేనో, వాడో ఒకరిమే యీ భూమ్మీద బ్రతకగలిగేది !"

అధాట్టుగా తలెత్తాను. శారద పిచ్చెక్కినట్లుగా తల అటూ యిటూ ఊగిస్తోంది. శారద ఏడుస్తోంది. వెక్కి వెక్కి ఏడుస్తోంది.

"చెప్పు సత్యం ! నన్ను ఇంకా బ్రతికి వుండమంటావా ? యెందుకు బ్రతకమంటావ్?—ఏం చూసుకు బ్రతకాలి నేను ?"

నేనేం చేయాలో, ఏం చెప్పాలో తెలియని అయోమయస్థితి.

శేఖరం ఇంత బలహీనుడని నాకు తెలియదు. నాకు తెలియకుండా ఇన్నాళ్ల శారద యీ నరకాన్ని అనుభవించిందని ఇప్పుడిప్పుడే అవగతమవుతోంది—జీవితమనే యీ దీపాన్ని గది నడుమ పెట్టి కిటికీ తలుపులన్నీ తెరిసే యెలా



కొట్టుకుంటుందో—అలా వున్నది శారద బ్రతుకు !

నాకు శారదను చూస్తే జాలి—ఆమె జీవితం చూస్తే భయం—ఆమె బ్రతుకును యీ స్థితికి దిగజార్చిన శేఖరాన్ని చూస్తే అసహ్యం.—

"అసలు యెందుకు వాడిలో ఇలాంటి అనుమానం తలెత్తింది ?"

"నిన్ను మంచి స్నేహితుడిగా మర్చిపోలేకపోవటమే ఇంత అలజడికి దారితీస్తుందని నేను అనుకోను !"

నేను మాటాడలేదు. మరిచిపోలేని స్నేహమయిన మాట వాస్తవమే మాది!

"ఆ రోజు విశాఖపట్టణం బీచిలోని మన సంభాషణని గూడా ఓ రోజు మాటల నడుమ చెప్పాను—ఆ తరువాత ఒకటి రెండుసార్లు నీ మాట వచ్చినప్పుడు ఆయన ముఖంలోని మార్పు నన్ను వివశురాల్నే చేసింది !"

"నన్ను మరిచిపోవాల్సింది — నా ప్రసక్తి యెన్నడూ తీసుకురాకుండా వుండవలసింది !"

"మీ రిద్దరూ మంచి స్నేహితులు—అంతదాకా యెందుకూ—మన ముగ్గురం మంచి స్నేహితులం—ఉహూ—అసలు అదేగాదు—మనిషి తోటిమనిషి మాట నమ్మలేనప్పుడు బ్రతకటం కష్టం సత్యం !" చాలా విసుగ్గా అన్నది.

"నిజమే కాని మనం కొన్నిటిని ఓర్చుకొని పరిస్థితులకు ఎడ్జస్ట్ అవ్వక తప్పదు !" సానునయంగా అన్నాను.

"అంత మంచి మిత్రులయివుండి—నీ ప్రసక్తి రాగానే అసహ్యించుకోవటం చూస్తున్నప్పుడు — నాకు ఆయనమీద అయిష్టత, నీమీద గౌరవం వాటంతట అవే పెరగసాగినయి !" చాలా చిన్నగా అన్నది.

నేను ఆప్యాయంగా శారద ముఖంలోకి చూడసాగాను.

"నిజం సత్యం ! నిన్ను నేను తక్కువ బాధపెట్టలేదు — అయినా నేనంటే నీకు కోపంలేదు — నీవుగానీ, నేనుగాని ఒక్కనాడూ తొందరపడలేదు — తప్పటడుగు వేయాలనే ఆలోచన మనలో కలగనేలేదు — అంతదాకా యెందుకు!" ఆవేశంగా ముందుకు వంగింది. "నిన్ను నేను కాదన్నప్పుడు నీవు నన్ను ఏమైనా చేసి వుండగలిగే

వాడివి— ఆ కోపంలో నామీద యెన్ని స్కాండల్స్ అయినా వేయగలిగి వుండే వాడివి — నా భవిష్యత్తునంతా నాశనం చేసి వుండగలిగేవాడివి — అయినా ఇంకా నన్ను నీవు గౌరవంగానే చూస్తున్నావూఅంటే—నీలోవున్న సంస్కారం అది — అతడిలోవున్న సంస్కారం ఇది !" చాలా వికారంగా ముఖంపెట్టి, "నాకు జీవితం వెగటు వేసేలా ప్రవర్తిస్తున్నాడు శేఖరం—ఛ ! ఛ !' అన్నది.

నాకేం మాటాడాలో తెలియలేదు.

నేను నాకు తెలియకుండా వాళ్ళ జీవితాలలో ఎంత అల్లకల్లోలాన్ని సృష్టించాను ? శారద జీవితంలో నేను నిప్పులే పోస్తున్నానా ?

"శేఖరంకు చెబుతాను — ఇంకెప్పుడూ నేను నీకు కనబడనని !" ఆలోచనే నాకు భరింపరానిదవ్వటంతో చాలా దిగులుగా శారద ముఖంలోకి చూస్తూ అన్నాను.

శారద కన్నార్పకుండా నా కళ్ళల్లోకే చూస్తున్నది. ఆమె తన కళ్ళల్లో ఉబుకుతున్న నీటిని అదుపులో పెట్టుకోలేకనే పోతున్నది—భరింపలేని వేదన ఆమెది !

నేను లేచి నిలబడ్డాను.

"శేఖరం యెప్పుడు వచ్చినా నన్ను కలవమని చెప్పు !"

ఆమె విగ్రహం లాగానే కూర్చున్నది.

"నేను వెళతాను !"

* * *

మరునాడుదయం యెనిమిదిగంటలప్పుడు సావిత్రి దగ్గరనుండి టెలిగ్రాం వచ్చింది.

"వెంటనే బయల్దేరండి—శారదను తీసుకుని — శేఖరం ఆసుపత్రిలో వున్నాడు !" దాని సారాంశం అది.

నా ఆశ్చర్యానికి అవధులే లేవు. శేఖరం హైద్రాబాద్‌కు యెందుకు వెళ్ళాడు ? వెళ్ళినా సావిత్రికి అతడు హైద్రాబాద్ వచ్చినట్టుగా యెలా తెల్సు? —అంతా అయోమయంగా వున్నది— నేను శారద ఇంటికి పరుగెత్తుకుంటూ వెళ్ళాను !

శారద కాఫీ త్రాగుతూ సోఫాలో కూర్చొని వున్నది. నన్ను చూస్తూనే వెలుగు నింపుకున్న కళ్ళతో లేచి నిలబడింది.

"కూర్చో ! కాఫీ కలుపుకు వస్తాను !"

"అక్ఖరలేదు — మనం అర్జంటుగా హైద్రాబాద్ వెళ్ళాలి !"

"దేనికి ?" వింతగా నా ముఖంలోకి చూస్తూ అడిగింది.

టెలిగ్రాం చూపించాను.

దాన్ని చదువుతూనే ఆమె ముఖం నల్లగా మాడిపోయింది.

—నిజమే ఏలాంటివాడైనా భర్త అయిన మొగాడు ఆరోగ్యం బాగుండక ఆసుపత్రిలో జేరితే విచారించని ఆడది వుండదు.

ఏదైనా భరించక తప్పదన్నట్టుగా ఒక్క నిట్టూర్పు విడిచి-

"మనిషిలో యెంత కుళ్ళు వున్నదో చూచారా — మనం యెంత విచ్చలవిడిగా యీ గుంటూరు నడిరోడ్లమీద తిరుగుతున్నా ఇలా సావిత్రికి చూపించేటందుకుగాను ఆవిడను తీసుకురావటానికి హైద్రాబాద్ వెళ్ళారన్నమాట !" అన్నది.

"నిజమా అది !" అంతకు మించి నాకు నోరు పెగలనిమాట వాస్తవమే !

"లేకపోతే నీవు ఇక్కడున్నప్పుడే ఆయన హైద్రాబాద్ యెందుకు వెళ్ళాలి?—వెళ్ళాడేఅనుకో. నీవు లేవనీ తెలిసి నీ ఇంటికే యెందుకు వెళ్ళాలి ? వెధవ మనుష్యులు — వెధవ బుద్ధులు !" విసుగ్గా సోఫాలో వెనక్కు జారిగిలబడిపోయింది.

"ఇంకా కూర్చుంటావేం — వెళ్దాం పద !"

"కూర్చో సత్యం ! — నాకీ జీవితమంటే మహా విసుగుపుడుతున్నది !" అని అంటున్న ఆమె కళ్ళల్లో తడి నన్ను వివశుణ్ణి చేసింది. "అవును సత్యం — నాకు ఇన్ని పరీక్షలా ?— నేను వీటికి తట్టుకోగలననే !"

నాకు ఆమెను చూస్తూంటే జాలి వేస్తున్నది. అలాగే ఆమె ముఖంలోకి చూస్తూ చాలాసేపు కూర్చుండిపోయాను.

"అబ్బ ! చచ్చిపోతే యెంత హాయిగా వుంటుంది నాకు !"

* * *

హైద్రాబాద్‌లో నేనూ, శారద మా యింటి గడపలో కాలుపెటేటప్పటికి సరిగ్గా సాయంత్రం అయిదుగంటలయింది.

నేను యెప్పుడు వస్తానా అన్నట్లుగా సావిత్రి యింటిలో యెదురుచూస్తూ కూర్చొని వున్నది.

"శేఖరంకు యెలా వున్నది !" నా మొదటి ప్రశ్న అది.

"కులాసాగానే వున్నారు — ఉస్మానియాలో — ఉదయం గూడా వెళ్ళి వచ్చాను !" అన్నది.

ఆమె సమాధానానికి నా గుండెలు కాస్త తేలికబడటంతో నాలోని ఆతురతను అణగదొక్కుకోసాగాను.

సావిత్రి శారద దగ్గరకు వచ్చి ఆప్యాయంగా ఆమె చేయి పట్టుకుంటూ, "రా శారదా !" అన్నది.

నాకు గుర్తున్నంతవరకూ సావిత్రి ఇంతవరకూ శారదను ఒకసారో, రెండుసార్లో చూసి వుంటుంది— కాని శారద నాకు మంచి స్నేహితురాలని సావిత్రికి తెలుసు !

"ఆసుపత్రికి వెళ్దామా మరి !"

"కానియ్యండి—ఇప్పుడేగదా అంత

దూరం ప్రయాణంచేసి వచ్చింది— కాస్త రెస్టు తీసుకుంటే ఒక గంటాగి వెళ్ళవచ్చు !"

తరువాత కొద్ది నిముషాలంలోనే సావిత్రి వంటరిగా నాకు దొరకగా ఆత్రంగా ఆమె రెక్కపట్టుకొని నా గది లోకి లాక్కువెళ్ళాను.

"చెప్పు ! శేఖరం యెప్పుడు వచ్చాడు ?"

"నిన్న !"

"ఏమన్నాడు !"

"నన్ను గుంటూరు రమ్మన్నాడు !"

సావిత్రిని పట్టుకున్న నా చేయి చచ్చుపడిబోతున్నట్లుగా నీరసంగా జారి పోయింది—శారద చెప్పింది అక్షరాలా నిజం !

"దేనికి రమ్మన్నాడు ?" నూతిలో నుంచి వచ్చినట్లే వున్నది ఆ మాట.

"మీ లీలలు చూచేటందుకు !" యెగతాళిగా నవ్వింది.

"నీవు నమ్మావా ?" భయం భయంగా సావిత్రి ముఖంలోకి చూస్తూ అడిగాను.

"నేను బలహీనురాల్ని కాదు !"

"యెందుకు నమ్మలేదు ?"

"నమ్మదగ్గదిగా లేదు గనుక !"

"నీవు యెలా అనుకున్నావు అలా అని !"

"మీ మనస్సు నాకు తెలియదా ?"

ఆమె సమాధానానికి నా మనస్సు తృప్తితో ఆనందంగా గంతేసింది.

ప్రేమగా సావిత్రి చేతిని నా చేతి లోకి తీసుకొని "నిజం ! సావిత్రీ—" అన్నాను.

ఒక్కక్షణమాగి, "మరి అతడు అంతటితో ఊరుకున్నాడా ?" అడిగాను ఆసక్తిగా.

"లేదు !— ఒత్తిడి చేశాడు—మీరు తన జీవితంలోనే గాకుండా నా జీవితంలో గూడా యెలా నిప్పులు పోస్తున్నారో చూడమన్నాడు — ఇంత మిత్రులయి వుండి తనను ఇంత మోసం చేస్తా రని కలలోగూడా అనుకోలేదని వాపోయాడు !—"

"వాడు నన్ను యెంతగా అపార్థం చేసుకున్నాడు !" నీరసంగా అన్నాను.

నేను చాలా గట్టిగానే చెప్పాను— మీకు శారదతోవున్న పరిచయం నాకు తెలుసన్నాను — నాకు యెన్నడూ అన్యాయం చేయరన్నాను — నిజంగా మీరు కోరుకుంటే నేను మీ జీవితంలోని ఆనందానికి అడ్డుగా నిలబడనని గూడా అన్నాను— నా మాటలకు ఆయన నా ముఖంలోకి వింతగా చూసాడు—"

నేను శూన్యంలోకి చూస్తున్నట్లుగా కిటికీలోనుంచి బయటకు చూస్తున్నాను.

"నిజమండీ ! ఆయన అలాంటివారు కాదు—నాకు ఆయనమీద దృఢమైన విశ్వాసమున్నది— దొంగచాటు పనులు ఆయనకు చేతగాదు — నిజంగా ఆయనకు శారదతోటే ఆనందమున్న దనుకుంటే నేను విడాకులివ్వటానికి గూడా సిద్ధమే ! అని నిశ్చయంగా అన్నాను."

సావిత్రి కళ్ళల్లో నీరు తిరగటం ఆమెలో నామీది అచంచలమైన భక్తికి నిదర్శనంలా కనిపించింది.

"సావిత్రీ !" ఆవేశంగా అడుగులు ముందుకు వేశాను.

"—అప్పుడే ఆయన సోఫాలో కూలబడిపోయాడు — గిలగిలలాడి పోసాగాడు — వెంటనే మన డాక్టర్‌కి ఫోనుచేశాను — ఆయన రాగానే ఆసు పత్రికి చేర్చాం !"

శారద కర్టెన్‌ను పట్టుకొని మావంకే చూస్తున్నది !

* * *

మేం ఆసుపత్రి ఆవరణలో కాలు పెట్టేటప్పటికి దీపాలు ఒక్కొక్కటే వెలగసాగినయి.

శేఖరంకు ఏంచెప్పాలో, యెలా చెప్పాలో గంటసేపటినుండి రిహార్సల్స్ వేసుకుంటూనే వున్నాను.

సావిత్రి ముందు నడుస్తున్నది. వెనుక నేనూ, శారదా—

యెంతదూరం నడిచామో మాకే తెలియదు.

"మీరు శేఖరంగారికోసరం వచ్చారా ?—ఆయన వెళ్ళిపోయారు— యీ చీటీ మీకివ్వమన్నారు!"

నేను ఉలిక్కిపడి తలెత్తాను.

సావిత్రికి బెడ్‌మీద పడుకున్న ఒక పేషెంట్ మడతపెట్టిన కాగితాన్ని అందిస్తున్నాడు—అతడి పక్క బెడ్— శేఖరంది కాబోలు — ఖాళీగా — మా ముఖంమీద ఇన్ని సున్నపు నీళ్ళు జల్లు తున్నట్లుగా వున్నది.

ఆత్రంగా, భయంగా నేను సావిత్రి చేతిలోనుంచి ఆ కాగితాన్ని లాక్కున్నాను.

"—అనుమానానికి ఆలవాలమైన ఓ స్త్రీకంటే గూడా నేను యెంత హీనంగా ప్రవర్తించాను — నాకు తెలుసు—శారదకు యీ వార్త వెళు తుందని — పరుగెత్తుకుంటూ ఇక్క డకు వస్తుందనీనూ — మీ అందరి యెదుట ఏ ముఖంతో నేను శారదకు కనబడేది—

సత్యానికి క్షమాపణలతో—

నేను గుంటూరు వెళుతున్నాను— శారదకోసరం ఆత్రంగా యెదురు చూస్తుంటాను—

—శేఖరం."